క్లుప్తంగా

నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న కృష్ణమూర్తినాయుడు, తదితరులు

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి గ్రామస్తుడు, ఎన్టీపీసీ విశ్రాంత జనరల్ మేనేజర్ కోట్ల కృష్ణమూర్తినాయుడు తన పుట్టినరోజును పురస్కరించుకుని సింగవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

భూసమస్యలపై ఫిర్యాదు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రఫీజాన్

మెరకముడిదాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు భూసమస్యలపై తహసీల్దార్ హజూర్ రఫీజాన్‌కు వినతిపత్రాలు అందజేశారు. చెల్లాపురం గ్రామానికి చెందిన గనుబోలు సత్యవతమ్మ తనకు వారసత్వంగా వచ్చిన భూమి మరొకరి పేరున ఆన్‌లైన్ అయ్యిందని, ఆ భూమిని తన పేరుమీద మార్చాలని కోరారు. ఊటపల్లికి చెందిన మండల రాజేశ్వరి తన డీపట్టా భూమిని ఆన్ లైన్ చేయాలని కోరారు. అలాగే పలువురు రైతులు తమ భూసమస్యలను పరిష్కరించాలని అభ్యర్థిస్తూ వినతిపత్రాలు సమర్పించారు. తహసీల్దార్ స్పందిస్తూ త్వరలోనే రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

ట్యాబ్‌ల పరిశీలన



గురుకుల బాలికల పాఠశాలలో ట్యాబ్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓలు బాలభాస్కరరావు, జగదీశ్వరరావు

వేపాడ: స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు గత ప్రభుత్వం ఇచ్చిన బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు, బైజూస్ టీమ్ మెంబర్లు సోమవారం పరిశీలించారు. ట్యాబ్‌ల్లో కంటెంట్‌ను, ఏమైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా అని పరీక్షించారు. అనంతరం కేజీబీవీ, మోడల్ స్కూల్, బక్కునాయుడుపేట ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓలు సందర్శించారు. మధ్యాహ్న భోజన వంటలను, విద్యార్థుల వర్క్ బుక్స్, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు



మాట్లాడుతున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాణి

గంట్యాడ: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై స్థానికులు సచివాలయ సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే హెచ్‌ఐవీ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని వైద్యారోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. హెచ్‌ఐవీ బాధితులు ఏఆర్‌టీ మందులు వాడుతూ మంచి ఆహారం తీసుకోవడం ద్వారా జీవిత కాలం పెంచుకోవచ్చని తెలిపారు. ఐసీటీసీలలో హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తారని చెప్పారు. వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వరావు, జిల్లా ఐసీటీసీల సూపర్‌వైజర్ సాక్షి గోపాల్‌రావు, ఎంపీహెచ్‌ఈఓ ఎర్రన్న, సర్పంచ్ బి.రామారావు, పంచాయతీ కార్యదర్శి వర్మ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని విజయనగరం జిల్లా చీపురుపల్లి గ్రామం కస్పా వీధికి చెందిన మొనంగి మోహనరావు(56)గా రైల్వే పోలీసులు గుర్తించారు. ఈ వ్యక్తి వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడని, నిత్యం తన గ్రామం నుంచి విశాఖ వైపు వెళ్తూ ఉంటాడని ఏం జరిగిందో ఏమో తెలియదు గానీ సోమవారం నౌపడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధిలో
సర్పంచ్‌ల పాత్ర కీలకం



బొండపల్లి: మాట్లాడుతున్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ కమిషనర్ కృష్ణమోహన్



కొత్తవలస : మాట్లాడుతున్న మినిస్ట్రీ ఆఫ్ పంచాయతీరాజ్ పరిశీలకులు నాగరాజు



గుర్ల: మాట్లాడుతున్న ఎంపీపీ పొట్నూరు ప్రమీల



జామి: సర్పంచ్‌ల శిక్షణలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గొర్లె సరయు



గజపతినగరం రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర చాలా కీలకమని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య, సాలిడ్ వేస్ట్‌మేనేజ్మెంట్, స్ట్రీట్ లైటింగ్ మెయింటెనెన్స్ తదితర అంశాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ బొండపల్లి, జామి, గుర్ల, మెరకముడిదాం, వేపాడ, ఎస్. కోట, గజపతినగరం, కొత్తవలస, ఎల్.కోట, దత్తిరాజేరు మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం ప్రారంభమైంది. ముందుగా గాంధీజీ చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామసభల నిర్వహణ, బిల్లులు ప్రతిపాదించడం, అభివృద్ధి పనులు ఎలా చేయాలి, పంచాయతీల్లో నిర్వహించాల్సిన నాలుగు రకాల సమావేశాలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీల్లో ఆదాయ వనరులను వినియోగించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. బొండపల్లి, జామి, గుర్ల, గజపతినగరంఎంపీపీలు చల్లా చలం నాయుడు, సబ్బవరపు అరుణ, పొట్నూరు ప్రమీల, బెల్లాన జ్ఞానదీపిక, జామి, గుర్ల, గజపతినగరం జెడ్పీటీసీలు గొర్లె సరయు, శీర అప్పలనాయుడు, గార తవుడు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ కమిషనర్ వి.కృష్ణ మోహన్, మినిస్ట్రీ ఆఫ్ పంచాయతీరాజ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డవలప్మెంట్ అధికారి ఎస్.నూకరాజు, బొండపల్లి, జామి, మెరకముడి దాం, వేపాడ, కొత్తవలస, లక్కవరపుకోట ఎంపీడీఓలు ఎంపీడీఓలు ఎస్.హరిహరరావు, తిరుమలరావు, ఎం.పావని, నిశ్చల, ఎస్.రమణయ్య, కె.రూపేష్, మండల పరిషత్ ఏఓలు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు



మెరకముడిదాం: శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ పావని



వేపాడ: సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న ఎంఓటీలు



దత్తిరాజేరు: శిక్షణ ఇస్తున్న అధికారులు



కొత్తవలస: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఓపీఆర్డీ ధర్మారావు



లక్కవరపుకోట : శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



చీపురుపల్లిరూరల్(గరివిడి): డ్రగ్స్‌ను దరిచేరనీయబోమంటూ ప్రతిజ్ఞ చేస్తున్న అవంతీ కళాశాల విద్యార్థులు ఎస్‌ఐ దామోదరరావు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీటీసీ భవాని, తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): డ్రగ్స్(మాదకద్రవ్యాలు) భవిష్యత్‌ను నాశనం చేస్తాయని ఎస్‌ఐ ఎల్.దామోదరరావు అన్నారు. డ్రగ్స్ తో కలిగే అనర్థాలు, వాటి నియంత్రణపై గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ ఆధ్వర్యం లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ యువతే దేశానికి వెన్నుముక అని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఒక సారి మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం పక్కదారి పడుతుందని, డ్రగ్స్ తీసుకునే వ్యక్తుల్లో చాలా మంది విచక్షణ కోల్పోయి అసాంఘిక కార్యక్రమాలు, నేరాలకు పాల్పడి జైలు జీవితాలను అనుభవిస్తూ వారి తల్లిదండ్రులకు శోకం మిగులుస్తున్నారని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అంతా సహకరించాలని కోరారు. సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్‌ను దరిచేరనీయబోమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఏఓ అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

గంట్యాడ: మాదక ద్రవ్యాల జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎంపీటీసీ పొటుపురెడ్డి భవాని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని పెదవేమలి గ్రామ సచివాలయంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారి ఎంతో మంది భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల జోలికి పోబోమని, వాటి నియంత్రణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సచివాలయ సిబ్బంది సంతోష్, పి.కార్తీక్, అనిల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్‌ఎం పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విప్లవ యోధుడు ఫిడెల్ క్యాస్ట్రో



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విప్లవ యోధుడు ఫిడెల్ క్యాస్ట్రో జయంతిని చరిత్రశాఖ నేతృత్వంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ ఆసియా, ఆఫ్రికా, లాటిన్‌అమెరికా దేశాల్లో ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు దన్నుగా నిలిచిన మహాయోధుడు క్యాస్ట్రో అని అన్నారు. క్యూబా నియంతృత్వాన్ని అంతం చేయడానికి సాయుధ పోరాటం నడిపి క్యూబా కు స్వేచ్ఛ ప్రసాదించాడన్నారు. అర్జెంటీనా, చిలీ, పెరూ దేశాల స్వాతంత్ర్యం కోసం చేగువేరాతో కలిసి పోరాటం చేశాడన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం, వలసవాదంపై అర్ధశతాబ్దం పాటూ అలుపెరుగని పోరాటం చేశాడన్నారు. చరిత్ర ఉపన్యాసకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కబేళాలపై పోలీసుల దాడి

విజయనగరం క్రైమ్: జిల్లాలో కబేళాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు గంజాయి, పశుమాంసం రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటిపై సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. కంటోన్మెంట్‌లో స్టార్ బిర్యానీ పాయింట్ పక్కన ఉన్న కబేళాపై దాడిచేసి 1100 కిలోల గోవు మాంసం, 13 కోసిన ఆవులను, బతికి ఉన్న 37ఆవులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కలెక్టరేట్ పెట్రోల్ బంక్ ఎదురుగా కబేళాపై దాడిచేసి 20 గోవులనుస్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో 8 మందిని అదుపులోకి తీసుకుని 3 వాహనాలను సీజ్ చేశారు.

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం



రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఆశయ రమణ

చీపురుపల్లి: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని జి.అగ్రహారంలో ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో గ్రంథపాలకుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి రంగనాథన్ నిరంతరం కృషి చేశారని చెప్పారు. గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలని, వాటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. శృతి మించిన సెల్ ఫోన్ వినియోగం ద్వారా ప్రస్తుత తరం పుస్తకాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్ యుగంలో, వైజ్ఞానిక సాంకేతిక రంగంలో ఎన్నో మార్పులు జరుగుతున్నప్పటికీ గ్రంథాలయాల ఆవశ్యకతను రంగనాథన్ అప్పట్లోనే గుర్తించారని చెప్పారు. అందుకే ప్రఖ్యాత యూనివర్శిటీల్లో సైతం గ్రంథాలయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని గుర్తు చేశారు.

అక్రమ తొలగింపులను ఆపండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు రమణ, తదితరులు

శృంగవరపుకోట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాజకీయ వేధింపుల్లో భాగంగా చిరుద్యోగులపై వేటు వేసి వారిని తప్పించి, తమకు నచ్చిన వారిని ఆయా ఉద్యోగాల్లో కూర్చోబెట్టాలని చేస్తున్న కుట్రలు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. కొత్తూరు వీఓఏగా కక్కల లక్ష్మిని కొనసాగించాలంటూ పలువురు డ్వాక్రా సంఘాల సభ్యులు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఎంపీపీ సోమేశ్వరరావు, ఎంపీడీఓ ఏ.ఏ.సాంబశివరావుకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అందచేశారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ పదేళ్లుగా కొత్తూరు గ్రామానికి చెందిన వీఓఏ కక్కల లక్ష్మి ప్రభుత్వ పథకాల అమలులో, డ్వాక్రా సంఘాల సభ్యులకు సహాయకారిగా, నామమాత్రపు వేతనంతో బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారన్నారు. ఆమెను తొలగించేందుకు టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలన్న దుగ్ధతో టీడీపీ నాయకులు చిన్న ఉద్యోగులను తొలగించాలని చెప్పడం, వారి ఆదేశాలతో అధికారులు గంగిరెద్దుల్లా తలాడిస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడి పేదల బతుకులతో ఆటలాడుకుంటే ప్రజాఉద్యమాలతో టీడీపీ నాయకులకు ఊపిరి ఆడకుండా చేస్తామని హెచ్చరించారు. పేదలకు బతుకు ఇచ్చి, పట్టెడు మెతుకులు పెట్టకుండా నోటి దగ్గర కూడు తీసేస్తున్న టీడీపీ నాయకులు తమ వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రజలు ఎందుకు అధికారం ఇచ్చారో తెలుసుకుని మెలగాలని కోరారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు జి.సత్యనారాయణ, జి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణించండి



శృంగవరపుకోట: ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు



జామి: ఎంఈఓ జయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ సంఘం నేతలు



చీపురుపల్లి: మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

శృంగవరపుకోట: విద్యాశాఖలో పనిసర్దుబాటు ప్రక్రియలోఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేతృత్వంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓకు పలు డిమాండ్లతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమ వారం వినతిపత్రం అందజేశారు. జీఓ 53 ప్రకారం పనిసర్దు బాటు చేయాలని, సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని, సర్దుబాటును డివిజన్ స్థాయికి పరిమితం చేయాలని, సొంత మేనేజ్‌మెంట్‌లో ఖాళీలు ముందుగా భర్తీచేయాలని, అంగవైకల్యం ఉన్నవారికి మినహాయింపు ఇవ్వాలని, ప్రైమరీ స్కూళ్లలో రోల్‌తో నిమిత్తం లేకుండా హెచ్‌ఎం పోస్టులు ఉంచాలని, యూపీ స్కూళ్లలో జీఓ 60మేరకు అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలని, దీర్ఘకాల సెలవుల్లో ఉన్న ఉపాధ్యాయులు ఉన్నచోట పనిసర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న డిమాండ్లను వినిపించారు.

తీవ్ర గందరగోళం

చీపురుపల్లి: పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను అమల్లోకి తీసుకొస్తూ ఉపాధ్యాయులను తీవ్ర గందరగోళానికి గురి చేయడం సమంజసం కాదని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గొర్లె పద్మ అన్నారు. జీఓ నంబర్ 117 రద్దు చేసిన తర్వాతే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ చేపట్టాలని కోరుతూ సోమవారం సాయంత్రం స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద పీఆర్టీయూ సంఘ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఓ వైపు స్వాతంత్ర్య వేడుకలు, మరోవైపు ఎస్‌ఎంసీ ఎన్నికలు, ఫార్మేషన్ బాధ్యతలు ఉన్న సమయంలో ప్రభుత్వం వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ అమలు చేసేందుకు చూడడం అన్యాయమన్నారు. ఏయే పాఠశాలలకు ఉపాధ్యాయుల అవసరం ఉందో ఆయా పాఠశాలలకు మిగులు ఉన్న ఉపాధ్యాయుల్లో జూనియర్లను సర్దుబాటు చేస్తే సరి పోతుందన్నారు. దీని కోసం మొత్తం వ్యవస్థను గందరగోళంలో పడేయడం దారుణమన్నారు. ప్రభుత్వం జీఓ నంబర్ 117ను రద్దు చేసి శాస్త్రీయ పద్ధతిలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయని చెప్పారు. యూటీఎఫ్, పీఆర్‌టీయూ సంఘ నాయకులు మెండి జగన్నాథ, దువ్వాడ కృష్ణమూర్తి, రౌతు రాము పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

గజపతినగరం: పనిసర్దుబాటు ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఆపివేయాలని ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు కోరారు. సోమవారం గజపతినగరం మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జీఓ నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జీఓ 53 ప్రకారం సర్దుబాటు చేయాలి

జామి: పనిసర్దుబాటు ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు ఎంఈఓ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీఓ నంబర్ 117, జీఓ 128 ద్వారా కాకుండా 2020లో తెచ్చిన జీఓ 53 ప్రకారం పనిసర్దుబాటు చేయాలని, ఈ ప్రక్రియలో సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని కోరారు. పనిసర్దుబాటు మండల, డివిజన్ స్థాయికే పరిమితం చెయ్యాలన్నారు. 70 శాతం అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను ఈప్రక్రియ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. మండలం యూటీఎఫ్ అధ్యక్షుడు వాసుదేవరావు, జిల్లా కార్యవర్గసభ్యులు దేముడుబాబు, కోశాధికారి శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యుడు పైడినాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం(ఎన్‌పీఎం దుకాణం)ను ఏర్పాటు చేశారు. ఈకేంద్రాన్ని ప్రకృతి వ్యవసాయ ఉత్తర కోస్తా రీజనల్ అధికారి ప్రకాశ్‌రావు, అడిషినల్ డీపీఎం స్వామి నాయుడు, ఏఓ శైలజ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంటలను ఆశించే తెగుళ్లు, చీడపీడలు, పురుగుల నివారణకు సంబంధించిన కషాయాలు, ద్రావణాలు ఈ కేంద్రంలో లభిస్తాయన్నారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. కషాయాలు, ద్రావణాలతో తెగుళ్ల వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. ఈకేంద్రంలో ఏ-గ్రేడ్ రకం కూరగాయల విత్తనాలు కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. వీఏఏ ప్రియాంక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శంకర్, సూర్యకుమారి, సింహాచలం, రాము, అనసూయ, సుశీల, రామకృష్ణ, గోవింద రావు, కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

విజయనగరం టౌన్: స్థానిక శాంతినగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఎం.లక్ష్మణరావుకు విజయనగరం డ్రైవర్స్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. కొద్దిరోజుల కిందట జరిగిన ప్రమాదంలో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా మారడంతో తోటి ఆటోడ్రైవర్లు స్పందించి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.27,604 నగదు, రూ.4 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు.